నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శనివారం 6 జనవరి 2024 | NIRMAL

ఎస్పీతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎస్పీని కలిసిన మాజీ మంత్రి

ఆదిలాబాద్ రూరల్, జనవరి 5 : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఉద్యోగరీత్య హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీని మాజీ మంత్రి జోగు రామన్న మర్యాద పూర్వకంగా కలిశారు. విధి నిర్వహణలో ఎలాంటి విధ్వంసాలకు చోటు ఇవ్వకుండా, తాను చూపించిన స్ఫూర్తిపై రామన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు పాల్గొన్నారు.

ఎస్పీకి వీడ్కోలు పలుకుతున్న జిల్లా పోలీసులు

ఘన వీడ్కోలు

ఆదిలాబాద్ ఎస్పీని గజమాలతో సత్కరించిన పోలీసులు

ఎదులాపురం, జనవరి 5 : ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డికి పోలీసులు ఘనమైన వీడ్కోలు పలికారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో గజమాలతో సత్కరించారు. ప్రత్యేక వాహనంలో ఎస్పీని ఎక్కించి హెడ్ క్వార్టర్ వరకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే 20 ఏండ్లపాటు సేవలు అందించానని, ఎస్పీ స్థాయి వరకు ఎదిగానని గుర్తు చేసుకున్నారు. దేశంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాల్లో ఆదిలాబాద్‌ను ఐదో స్థానం, తెలంగాణ రాష్ట్రంలో మొదటి స్థానం వచ్చేలా చేయడం సంతోషంగా ఉందన్నారు. అదనపు ఎస్పీ సమయ్‌జాన్‌రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, శ్రీనివాస్‌జి, పోతారం శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

● ఇథనాల్ ఫ్యాక్టరీతో ముప్పు వాటిల్లదు.. ● సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ అర్బన్, జనవరి 5 : ఇథనాల్ ఫ్యాక్టరీతో ప్రజలు, రైతులు, పర్యావరణానికి ఎలాంటి ముప్పు వాటిల్లదని.. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హెచ్చరించారు. శుక్రవారం నిర్మల్ కలెక్టర్ సమావేశ మందిరంలో ఫ్యాక్టరీ మేనేజర్స్, అధికారులు, దిలావర్‌పూర్ మండల గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ వల్ల కలిగే లాభాలను ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. ఫ్యాక్టరీపై దాడి చేయడం సరైంది కాదని, ఒకవేళ ఏమైనా అపోహలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు, గ్రామస్తులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి..

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

తానూర్, జనవరి 5 : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని వడ్‌గావ్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా మండలంలోని జవుల(కే), తొండాల, వడోన గ్రామాల్లో కూడా పర్యటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్ పటేల్. తహసీల్దార్ లింగమూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి కాంగ్రెస్ తూట్లు

● 7,400 ఇండ్లను మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం
● 46,732 మంది అర్హులుగా గుర్తింపు
● కాంగ్రెస్ ప్రభుత్వంపై పేదల ఆగ్రహం

ఆదిలాబాద్, జనవరి 5(నమస్తే తెలంగాణ) : ఇండ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగా డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఉచితంగా పేదలకు పంపిణీ చేసింది. ఒకేచోట స్థలంతోపాటు రెండు గదులు స్లాబ్ ఇండ్లను నిర్మించి ఇచ్చింది. దీనికితోడు పేద మహిళలు తమకు నచ్చిన విధంగా ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించింది. ఇందు కోసం గృహలక్ష్మీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సొంత స్థలం ఉండి ఇంటిని నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని చెప్పింది. దశలవారీగా(పునాది, రూప్ లేవల్, ఇళ్లు పూర్తయిన తర్వాత) డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని ప్రణాళికలు రూపొందించింది. దరఖాస్తులను ఆహ్వానించగా భారీ సంఖ్యలో వచ్చాయి.

దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన మహిళలు(ఫైల్)

రద్దు చేసిన కాంగ్రెస్

బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకం అమలులో భాగంగా నియోజకవర్గానికి 3 వేల ఇండ్ల చొప్పున ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 7,400 ఇండ్లను మంజూరు చేసింది. ఈ పథకానికి 65,827 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం 46,732 మందిని అర్హులుగా గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ఈ సమయంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక నిలిచింది. ఎన్నికల తర్వాత తమకు గృహలక్ష్మీ ఇండ్లు మంజూరవుతాయని ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే ఎదురైంది. గృహలక్ష్మీ పథకం వల్ల తమ సొంతింటి కల నెరవేరుతున్నదనే ఆశలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఈ పథకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇందిరమ్మ ఇండ్ల పేరిట గృహలక్ష్మీ పథకాన్ని రద్దు చేయడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదల సొంతింటి కలకు మంగళం

ఉట్నూర్ ప్రభుత్వ దవాఖాన ఎదుట సిబ్బంది

స్టేట్ ఫస్ట్

మెరుగైన వైద్య సేవల్లో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖాన నంబర్ వన్

ఉట్నూర్, జనవరి 5 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు అరుదైన గౌరవం దక్కింది. ఏజెన్సీ ఏరియాలో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తుండడంతో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. నేషనల్ క్వాలిటీ ఆష్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్ లభించింది. ఈ సంస్థ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానల్లో సౌకర్యాలు, విధులు, సౌకర్యాల నిర్వహణ, రికార్డులు, వైద్య సేవల వంటి తొమ్మిది అంశాలపై సర్వే నిర్వహించింది. ఇందులో ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తొమ్మిది అంశాల్లో 90 శాతం మార్కులు వచ్చాయి. దీంతో రాష్ట్రంలోనే నంబర్ వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నది. సూపరింటెండెంట్ ఉపేందర్, వైద్యులు మహేందర్, జాదవ్ కపిల్, సిబ్బందిని పలువురు అభినందించారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

నియోజకవర్గ అభివృద్ధికి ముందుండాలి..

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

నేరడిగొండ, జనవరి 5 : బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుండాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ అధికారులతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం తేజాపూర్ నుంచి నేరడిగొండ వరకు రూ.43 లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచ్ ప్రపుల్ రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నాసక్‌సింగ్, సీనియర్ నాయకులు సయ్యద్ జహీర్, శంకర్, సర్పంచ్‌లు విశాల్, కుమ్రం జంగు, నాయకులు పద్మనాభరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మందాడి కృష్ణ, భీమ్‌రావ్, సుజిల్ కుమార్, నారాయణ, సురేందర్, భూషణ్, రాజశేఖర్ రాథోడ్, ప్రదీప్, లక్ష్మణ్, గులాబ్ సింగ్, కరణ్ సింగ్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

నిర్మల్ అర్బన్, జనవరి 5 : ఇటీవల నిర్మల్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జానకి షర్మిల శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు. స్థానిక సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో మార్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు.

ఫటా ఫట్..

● రూ.40 కోట్లు మంజూరు చేసిన కేసీఆర్ ప్రభుత్వం
● ప్రత్యక్షంగా 1000 మందికి.. పరోక్షంగా వేలాది మందికి ఉపాధి

శరవేగంగా ఐటీ టవర్ నిర్మాణ పనులు

ఆదిలాబాద్, జనవరి 5(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్య, వైద్యం, ఉపాధి, తాగు, సాగు నీరు, రవాణా రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించింది. హైదరాబాద్, బెంగళూరు, పుణె లాంటి నగరాలకు పరిమితమైన ఐటీ కంపెనీలు ఆదిలాబాద్ జిల్లాలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. రెండున్నరేండ్ల క్రితం బీడీఎన్టీ ఐటీ కంపెనీ ప్రారంభం కాగా 120 మంది, ఆరు నెలల క్రితం ఎన్డీటీ డాటా కంపెనీ తమ కార్యకలాపాలు ప్రారంభించగా 100 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. కంపెనీలు ప్రారంభంకాక ముందు ఐటీ కంపెనీల్లో పని చేయడానికి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కేసీఆర్ ప్రభుత్వ కృషి ఫలితంగా సొంత జిల్లాలో ఉద్యోగాలు చేసుకుంటు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతున్నారు.

ఆదిలాబాద్‌లో కొనసాగుతున్న ఐటీ టవర్ నిర్మాణ పనులు

రూ.40 కోట్లతో ఐటీ టవర్

ఆదిలాబాద్ జిల్లాలో ఐటీ రంగం విస్తరించి, అధిక మందికి ఉపాధి కల్పించడానికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఐటీ టవర్‌ను మంజూరు చేసింది. మావల మండలం బట్టిసవర్‌గాంలోని సర్వే నంబరు 72లో మూడెకరాల స్థలంలో రూ.40 కోట్లతో టవర్‌ను నిర్మిస్తున్నది. ఇందుకు సంబంధించిన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. నిర్మాణ పనులను టీఎస్ఐఐసీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అన్ని హంగులతో 50 వేల చదరపు అడుగుల వైశాల్యంలో నిర్మిస్తుండగా.. ఏడాదిలోగా పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పలు కంపెనీలు ఈ టవర్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉండగా.. 1000 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఫలితంగా వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలు పెరుగడంతోపాటు పరోక్షంగా స్థానికులకు ఉపాధి లభించనుంది.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి..

● ఈనెల 17వ తేదీ వరకు పూర్తి కావాలి.. ● ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
● ఆపరేటర్లకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ

ఎదులాపురం, జనవరి 5 : ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులలోని వివరాలను తప్పులు లేకుండా వైబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు డేటా నమోదుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నేటి(శనివారం)తో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ 95 శాతం పూర్తయ్యిందని, డేటా నమోదును 17వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తులు గల్లంతు కాకుండా జాగ్రత్త వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే ఆపరేటర్‌తోపాటు అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డేటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందుతాయని.. ఆధార్, రేషన్ కార్డు, సెల్ నంబర్లను తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. అంతకుముందు మాస్టర్ ట్రెయినర్ వినోద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డాటా ఎంట్రీ నమోదు ప్రక్రియను వివరించారు. ఆపరేటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

సమ్మె సైరన్

● నిర్మల్‌లో బల్దియా పారిశుధ్య కార్మికుల దీక్ష
● ఆగిన జీతాలు.. విధులకు హాజరుకాని సిబ్బంది..
● పేరుకుపోతున్న చెత్త.. కంపు కొడుతున్న కాలనీలు..
● సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తాం..

నిర్మల్ మున్సిపాల్టీలోని పారిశుధ్య కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి మూడో రోజుకు చేరుకున్నది. సమ్మెకు కార్మిక సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

నిర్మల్ అర్బన్, జనవరి 5 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో గల అవుట్ సోర్సింగ్ విభాగంలోని పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బంది, నూతన లేబర్లు, డ్రైవర్లు సమ్మెకు దిగారు. 252 మంది పారిశుధ్య కార్మికులు ఉండగా.. ఇందులో కేవలం 14 మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్‌లో 86 మంది, 45 మంది కొత్త లేబర్లు, 15 మంది డ్రైవర్లు అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు 70 శాతానికిపైగా కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో పనులు నిలిచిపోయాయి.

సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు

నిలిచిన సేవలు..

కంపు కొడుతున్న కాలనీలు..

పారిశుధ్య కార్మికులు సమ్మెలో పాల్గొనడంతో ప్రధాన వీధులతోపాటు కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. వీధి లైట్లు వెలుగడం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నది. ఈగలు, దోమలు విజృంభిస్తాయని, అనారోగ్యం పాలవుతామని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

నిర్మల్ బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై పేరుకుపోయిన చెత్త

కార్మికుల డిమాండ్లు..

- ఇంజినీరింగ్, శానిటరీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి.
- పీఆర్‌సీ ఇవ్వాలి. పీఎఫ్ చెల్లించాలి.
- నూతనంగా చేరిన 45 మంది కార్మికులు, 15 మంది డ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి.
- ఈఎస్ఐలో ఇంటి పేరు, ఇతర తప్పులను సరిచేయాలి.
- ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు అందించాలి.

జీతాలు చెల్లించాలి..

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నా. సరైన సమయంలో జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా. పట్టణ పరిశుభ్రతలో కీలకంగా వ్యవహరిస్తున్నామని, ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరైంది కాదని ఆవేదన చెందుతున్నారు. 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి. అంతేకాకుండా ఈఎస్ఐ, ఫీఎఫ్ సౌకర్యం కల్పించి మా కుటుంబాలను ఆదుకోవాలి. *- చందెల బందెన్న, నిర్మల్.*

కుటుంబ పోషణ కష్టంగా ఉంది..

నిర్మల్ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికురాలిగా కొన్నేండ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా. ప్రతినెల సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నా. కొన్ని నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నాం. వెంటనే జీతాలు చెల్లించాలి.

- దీకొండ నర్స, నిర్మల్.